
# జాగ



"సర్కారు జాగ! ఇస్తందుకు తీస్కుంటందుకు మాకు పూర్తిగ హక్కుంటది. అప్పుడిచ్చినమంటే ఎవ్సాయం చేస్కుంటవని, దుంతవని, బత్కుతవని ఇచ్చినం. నువ్వేమొ పడావ బెడ్తివి. పడావ పెట్టిన భూమిని మళ్ళ ఎన్కకు తీస్కోవచ్చు. ఎర్కేనా?" ఎమ్మార్వో దబాయించి చెబుతున్నాడు.

"నేనెన్నడు పడావ బెట్టలే దొర. దుంతనే వున్న. ఇయ్యేడు జొన్నలల్కిన. నిరుడైతె ఎనిమిది కుండల పజ్జొన్నలైనై. మూడుబుడ్ల పెసళ్ళు గూడ అయినై. నేనెప్పుడు పడావ బెట్టలే. నువ్వు ఎంకోరి చేసుకోదొర" భూమయ్య చేతులు కట్టుకొని వివరిస్తూ ఉంటే భూమయ్య చిన్నకొడుకు అందుకున్నాడు.

"మా భూమిని ఎట్లా గుంజుకుంటరు సార్? ఇన్నేండ్ల సంది మా అయ్య దుక్కులు దున్ని భూమి సదును జేసిండు. కుదుళ్ళు తీసిండు. అడ్డెడు బుడ్డెడు పండిచ్చి మమ్ముల సాదిండు. ఇప్పుడా మూడెకరాలగూడా లేకుంట జేస్తెట్లా" భూమయ్య చిన్నకొడుకు గొంతులో కొంత పెడసరపుతనం బయటపడుతూ ఉంది. ఎమ్మార్వోకు చిరాకేసింది. "నీకు నోటీసులిచ్చే తీసుకున్నాంగదా?" అని భూమయ్యను గదమాయించాడు. భూమయ్య అవునన్నాడు. అయితే ఆ నోటీసుకు భూమయ్య జవాబు కూడా ఇచ్చాడు. జవాబును బేఖాతరు చేసి భూమిని తీసేసుకున్నాడు ఎమ్మార్వో.

అందుకు కారణముంది. జెండావందనం నాడు ఆ ఊరికి మంత్రొచ్చాడు. మంత్రికి చోటామోటా లీడర్లంతా సలాములుగొట్టి దండలేసారు. దాంతో మంత్రి కుషీ అయిపోయాడు. ఎలక్షన్లొస్తున్నాయనుకున్నాడేమో- ఆ పల్లెలో ఇండ్లులేని వాళ్ళందరికి ఇండ్లస్థలాలిస్తామని ప్రకటించాడు. ప్రకటించడమేకాదు.

వారం రోజుల్లోపల ఆ ఊళ్ళో ఇండ్ల జాగలు పంపిణీ కావాలని కలెక్టర్‌కు గట్టిగా చెప్పాడు. కలెక్టరు ఎమ్మార్వోను ఆదేశించాడు. "వారం రోజుల్లో ఇండ్లజాగ పంపిణీ కావాలి. లేకపోతే మినిష్టరుగారు ఊరుకోరు."

ఆ ఊళ్ళో ప్రభుత్వ భూమి ఖాళీగాలేదని ఎమ్మార్వో కలెక్టర్‌కు చెప్పాడు. కలెక్టర్ రెండు నిమిషాలు ఇంగ్లీషులో తిట్టి 'ఇదివరలో పంచిపెట్టిన భూములుంటాయి వెనక్కి తీసుకొమ్మ'ని ఆదేశించాడు. ఎమ్మార్వో నసిగాడు.

"సర్, ప్రభుత్వం పంచిపెట్టిన భూమిని వెనక్కి తీసుకోవాలంటే నష్టపోయేవాడికి పదిరోజుల ముందైనా నోటీసివ్వాలి. మరి మినిస్టర్‌గారేమో వారంరోజుల్లో కావాలని..."

**ఏనుగు నరసింహారెడ్డి**

"ఇంత అనుభవం ఉండేంలాభం. ప్రతిదీ ఎవరో చెబితేనే చేస్తావు. సొంత ఆలోచనలేదూ... ఎలక్షన్లుకానియ్... తుప్పలు తంగెళ్ళు పట్టిస్తాడు మినిష్టర్. వెళ్ళు. వెళ్ళి 20 రోజుల కింద నోటీసు రాసి సర్వ్ చేసినట్ల రాసుకో. రిశ్యూమ్ చేసినట్లు రాసుకో...." కలెక్టర్ తిడుతూనే ఒక చక్కని సలహా ఇచ్చాడు.

ఎమ్మార్వో వెంటనే కార్యరంగంలోకి దిగాడు. గిర్దావరును పిలిచాడు. ఊళ్ళో ప్రభుత్వ భూములు ఎవరెవరికి పంపిణీ జరిగాయో చిట్టా తీయమన్నాడు. గిర్దావరొక ఇరవైమంది పేర్లు చెప్పాడు. ఆ ఇరవైమందిలో ఏ అండా ఆదెరువూ లేని వాడెవడో చెప్పమన్నాడు. ఆధారం ఏదీ లేని భూమయ్య దొరికిపోయాడు.

వ్యవసాయంకోసం ఇచ్చిన భూమి వ్యవసాయం చేయక పడావ ఉంచినట్లు భూమయ్య మీద ఆరోపించబడ్డది. నోటీసు జారీచేయబడ్డది- పాతడేట్లో. కొంతలో కొంత తెలివిచేసి భూమయ్య జవాబు కూడా సమర్పించాడు. భూమయ్య దున్నిన మూడెకరాలు ఒక్కటే రోజులో రిశ్యూమ్ చేయబడ్డది. సర్వే, ప్లాటింగ్, లేఔట్ అంతా సిద్ధమైంది.

భూమయ్య అవాక్కయాడు.

"ఇదన్యాలం దొర. ముప్పైఏండ్ల కింద నేను సోరపిలగాన్నున్నప్పుడిచ్చిన భూమిది. సర్కార్దే. కని దీన్ని నేను శాన మార్పు చేసిన దొర. ఆనాడు ఈ నేలంతా ముండ్లపొదలు, కంపచెట్లు, చెల్కకూడా పనికిరాంది ఈనేల. నేను మూడునాలు గొండ్లు కష్టపడి సాగుచేసిన. అయితే ఇన్నేండ్లనుంచి నేనిండ్ల మిగిలిచ్చుకుందేంలేదు. నాకు కూలి పడ్డది. ఈ కూలి ఏడ్నైనా చేసుకొమ్మని నువ్వొక్కమాటల అనొచ్చు. దొర! నాకు ఈ మూడెకరాల నేల తల్లి తీర్న..." భూమయ్య కళ్ళనుండి నీళ్ళు కారుతున్నాయి. అతని వాదన ఎమ్మార్వోకు కూడా సమంజసంగానే అనిపిస్తుంది. కానీ తన చేతుల్లో ఏమీలేదన్న విషయం ఎలా చెప్పాలో తెలియడంలేదు.

"చూడు భూమయ్య, నీకు ఒకనాడు ఈ భూమి ఇచ్చినమాట ఎంత నిజమో ఇప్పుడిదే భూమి మళ్ళీ సర్కారుకు అవసరమున్నమాట అంత నిజం" అన్నాడు ఎమ్మార్వో.

"ఈ చౌడునేలతో సర్కారు కేంప నుంది సర్?" భూమయ్య కొడుకు ప్రశ్న.

"ఇండ్ల జాగలక్కావాలిది" ఎమ్మార్వో.

"ఎవరికి ఇండ్ల జాగలు కావాలిసర్"

"ఈ ఊళ్ళోవాళ్ళకే"

"ఈ ఊళ్ళో ఇండ్ల జాగలు లేందెవలికి సర్. అందరికి ఇండ్ల జాగలున్నయి. ఇండ్లున్నయ్. ఒకవేళ ఇండ్ల జాగలు లేని వాళ్ళుంటే అది మేమేసార్. మాకు మా చిన్నయ్య వాళ్ళకే ఇండ్ల జాగల్లేవ్." భూమయ్య కొడుకు మాటలు సూటిగా ఉన్నాయి. ఆ మాటల పదును ఎమ్మార్వో గమనిస్తూనే ఉన్నాడు. కొద్దిగా చదువున్న భూమయ్య కొడుకు కొత్త రాజకీయ పోకడలను గమనిస్తున్నాడు. అతనికి రాజకీయ లబ్ధిదారులు ఎలా ఎత్తులు వేసేది తెలుస్తూనే ఉంది. "మినిష్టర్‌గారిని అడ గండి మీరేదైనా అడగదలిస్తే. ఈరోజే పట్టాల పంపిణీ" అని చెప్పి ఎమ్మార్వో వెళ్ళిపోయాడు.

భూమయ్య అతని కొడుకు ఆ భూమి వద్దే నిశ్చేష్టులై నిలబడిపోయారు. భూమయ్యకు ఆ భూమిపై తను పెంచుకున్న మమకారం ఎలా తెంచుకోవాలో అర్థంకాలేదు. తను ఆ నేలను పొదలు కొట్టి కర్రదుంగలు తీసి చదును చేసుకున్న రోజులు గుర్తుకురాసాగాయి. కళ్ళనుండి బొటబొటా నీళ్ళు రాలిపడ్డాయి. పెద్దాఫీసుకు వెళ్ళి ఫిర్యాదు చేద్దామన్నాడు భూమయ్య కొడుకు. నిజంగా ఇంటి జాగలేని వాళ్ళుంటే భూమి వదిలేస్తామని సవాలు చేద్దామన్నాడు. భూమయ్య వారించాడు. కుటుంబంలో ఎందరు వ్యక్తులుంటే అందరికి ఒకోక్క ఇంటి జాగా ఇవ్వదలిచారని చెప్పాడు తండ్రి. అదేం న్యాయమని అడిగాడు కొడుకు. ఊరికిన్ని ఇండ్ల జాగలు ఇచ్చి తీరాలని అనుకుందట సర్కారు.

మంత్రి ఇండ్ల జాగల పట్టాలిచ్చాడు. భూమయ్య జొన్నచేను మీద ప్లాట్ల రాళ్ళు పరుచుకున్నాయి. ●

## కొన్ని మంచిసినిమాలు చాలు



ప్రతి సినిమాలోనూ వెరైటీ పాత్ర పోషించాలన్నది ప్రీతిజింటా ఆశ. ఆ మాటకొస్తే ప్రతినటీ,నటుడి కోరిక కూడా అదే అయివుంటుందనుకోండి. వైవిధ్యభరితమైన పాత్రలను పోషించడం ద్వారానే నటనాప్రతిభ వెలికివస్తుంది కదా?! అయిన వారి,వీరి కోరికలు, ఆశలను బట్టి మూససిని మా పద్ధతులు రూపుదిద్దుకోవు కదా?!

మరీ ఇలా, సెలెక్టివ్‌గా పాత్రలను ఎంపిక చేసుకుంటూ పోతేఎలాగమ్మడు అని ప్రశ్నిస్తే 'అలా ఆలోచించడమెందుకు' అని ఎదురు ప్రశ్నిస్తుంది ప్రీతి. ఎన్ని సినిమాలు అనుకోవడం కన్నా ఎన్ని మంచిసినిమాలు అని ప్రశ్నించుకుంటాను నేను అనే ప్రీతి తనకు నమ్మకం ఉన్న సినిమాల్లోనే నటిస్తానంటోంది. సినిమా కథ తనను ఎగ్జయిట్ చేయలేకపోతే ఎవరూ తనను నటింపచడానికి ఒప్పించలేరని చెబుతుంది. రెండువేల సినిమాల్లో నటించాలని నాకు లేదు మంచివి ఓ ఇరవై సినిమాల్లో నటిస్తే చాలు నేను అనే జింటా బేబి తనకు, తన కుటుంబానికి ప్రైవసీ ఎంతో అవసరమని అందుకే మీడియాతో తక్కువగా మాట్లాడతానని అంటుంది. ●